క్లుప్తంగా

గిరిజన ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం



కొండ చీపుర్లను పరిశీలిస్తున్న ఏపీఎం కూర్మారావు

హిరమండలం: గిరిజన ప్రాంతాల్లో మహిళలు ఉత్పత్తి చేసిన వస్తువులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో ఓపెన్ నెట్ వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ (ఓఎన్‌డీసీ)ప్లాట్ ఫామ్‌లో నమోదు చేయాలని వెలుగు ఏపీఎం పైడి కూర్మారావు తెలిపారు. మండలంలోని నొగూడలో ఏర్పాటుచేసిన వన్‌ధన్ వికాస కేంద్రాన్ని శుక్రవారం పరిశీలించారు. సభ్యులకు పలు సూచనలు చేశారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు ఆదిలక్ష్మి, వీఏఓ బి.సరస్వతి, క్లస్టర్ కో ఆర్డినేటర్ జయంతి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సరుబుజ్జిలి: జిల్లాలోని పలు కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న నాన్ టీచింగ్ పోస్టులకు మండల వాసులు ఎవరైనా అర్హత ఉంటే దరఖాస్తులు చేసుకోవాలని ఎంఈఓ డి.బాలరాజు శుక్రవారం ప్రకటనలో వెల్లడించారు. 7వ తరగతి చదువుకుని, వయస్సు 21 నుంచి 47 ఏళ్ల మధ్య ఉన్న మహిళలు ఈ నెల 15వ తేదీలోగా ఎంఈఓ కార్యాలయానికి జిరాక్స్ పత్రాలపై గజిటెడ్ అధికారి సంతకంతో దరఖాస్తు అందజేయాలన్నారు.

వైద్య సిబ్బంది హాజరుపై ఆరా



అటెండెన్స్ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

నరసన్నపేట: స్థానిక ఏరియా ఆస్పత్రిలో వైద్యులు, మినిస్టీరియల్ సిబ్బంది, స్టాఫ్ నర్సులు, ఇతర సిబ్బంది సమయ వేళలపై ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఆరా తీశారు. శుక్రవారం ఆస్పత్రిని తనిఖీ చేశారు. సిబ్బంది అటెండెన్స్ రిజిస్టర్‌ను పరిశీలించారు. ఎంత మంది వైద్యులు వచ్చారు, రానివారు లీవ్ లెటర్ పెట్టారా.. లేదా అని ఏఓను అడిగి తెలుసుకున్నారు. ఫేస్ యాప్‌ను పరిశీలించారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు సకాలంలో సేవలు అందివ్వాలన్నారు. మందుల సరఫరా, ఇతర పరికరాల పనితీరును పరిశీలించారు. ప్రహరీ నిర్మాణంలో జరుగుతున్న జాప్యంపై ఇంజినీరింగ్ అధికారులతో ఫోనులో మాట్లాడారు. ఉప సర్పంచ్ సాసుపల్లి కృష్ణబాబు, తదితరులు ఉన్నారు.

అటెన్షన్ ప్లీజ్



శిథిలమైన బ్రిడ్జి

సరుబుజ్జిలి: అలికాం–బత్తిలి ఆర్‌అండ్‌బీ రహదారిలోని సవలాపురం జంక్షన్ వద్ద బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకుంది. ఇటీవల ఒడిశా రాష్ట్రం నుంచి భారీ యంత్రాలతో 16 టన్నులు లారీలు ప్రయాణాలు చేయడం వల్ల మరింత పాడైంది. ప్రధాన రహదారి కావడంతో నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. దీనివల్ల ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకువస్తుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


రహదారి నిర్మాణం



రోడ్డు నిర్మాణ పనులు చేస్తున్న దృశ్యం

సారవకోట: మండలంలోని బొంతు నుంచి పాతపట్నం మండలం తెంబూరు వరకు రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. సారవకోట మండలంలోని పెద్దలంబ, బొంతు మీదుగా హిరమండలం వెళ్లే రోడ్డు నిర్మాణానికి గత ప్రభుత్వంలో నిర్మాణ పనులు చేపట్టారు. అప్పట్లో హిరమండలం మండలంలోని సవితిసీది నుంచి పెద్దలంబ గ్రామం వరకు నిర్మాణ పనులు పూర్తి చేశారు. ప్రస్తుతం పెద్దలంబ నుంచి తెంబూరు వరకు రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నారు.

భయాందోళన..



విరిగిపోయి ఉన్న తలుపు

సారవకోట: మండలంలోని నౌతళ ఘాట్ రోడ్డు పక్కన నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పనిచేస్తున్న సిబ్బంది భయం, భయంగా విధులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ నిర్మించిన సబ్‌స్టేషన్ సిబ్బంది గది పక్కనే కొండ ఉంది. తలుపులు, కిటికీలు పూర్తిగా పాడైపోయాయి. రాత్రి పూట విధులు నిర్వహించే సిబ్బందికి వన్యప్రాణుల నుంచి రక్షణ కరువౌతుంది. విష కీటకాలు గదిలోకి వస్తున్నాయని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మెయిన్ రోడ్డు..

విస్తరణ పూర్తయ్యేనా..

- గత ప్రభుత్వ హయాంలో 1.1 కిలో మీటర్లు పొడవున రోడ్డు విస్తరణ
- 1.7 కిలో మీటర్లు మిగిలి ఉన్న విస్తరణ పనులు
- రోడ్డు విస్తరణ చేపట్టాలని కోరుతున్న నరసన్నపేట పట్టణ వాసులు



విస్తరణ చేయాల్సిన మెయిన్ రోడ్డు

నరసన్నపేట: నియోజకవర్గ కేంద్రం నరసన్నపేట వాసుల చిరకాల కోరిక అయిన మెయిన్ రోడ్డు విస్తరణను గత ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ కృషితో పనులు చేపట్టారు. సత్యవరం జంక్షన్ నుంచి మార్కెట్ కమిటీ జంక్షన్ వరకు 2.8 కిలో మీటర్ల పొడవున రోడ్డు విస్తరణ చేపట్టాలని భావించారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న వ్యాపారులు 80 అడుగుల వెడల్పుతో రోడ్డు విస్తరణకు అంగీకరించి తమ షాపులు, ఇళ్లను తొలగించేందుకు అంగీకరించారు. నిధుల కొరత దృష్ట్యా పల్లిపేట కూడలి నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ మధ్య మాత్రమే 80 అడుగుల వెడల్పుతో రోడ్డు విస్తరణ చేపట్టారు. గతంలో 14 మీటర్ల వెడల్పు ఉన్న రోడ్డు 80 అడుగుల వెడల్పుతో విస్తరణ చేసిన తరువాత పట్టణ రూపురేఖలు మారాయి. వస్త్ర, బంగారంతో పాటు ఇతర దుకాణాలు ఏర్పాటయ్యాయి. ఇదే తీరున మిగిలిన 1.7 కిలో మీటర్లు రోడ్డు కూడా వెడల్పు చేస్తే నరసన్నపేట పట్టణం మరింతగా అభివృద్ధి చెందుతుందని స్థానిక వ్యాపారులు అంటున్నారు. గత ప్రభుత్వ హయంలో ఈ పనులు నిర్వహించేందుకు ఆర్‌అండ్‌బీ శాఖ రూ. 11.45 కోట్లతో ప్రతిపాదనలు పంపింది. ఈ పనులకు నేరుగా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. అయితే సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం జరిగింది. ఈ రోడ్డు విస్తరణ పనులు జరుగుతాయా, లేదా అన్న అనుమానం స్థానికుల్లో వ్యక్తవుతోంది. రాజకీయాలను పక్కన పెట్టి పట్టణ ప్రజలు, వ్యాపారులు చిరకాల కోరికను దృష్టిలో పెట్టుకొని రోడ్డు పనులు పూర్తిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

మిగిలిన పనులు పూర్తి చేయాలి



నరసన్నపేట పట్టణానికి మెయిన్ రోడ్డు చాలా కీలకమైంది. వ్యాపారాలన్నీ ఈ రోడ్డుకు ఇరువైపులా కేంద్రీకృతమయ్యాయి. దీంతో భాగా రద్దీ పెరిగింది. రోడ్డు విస్తరణ పనులు గతంలో కొంత భాగం చేశారు. మిగిలిన బాగం ఉండి పోయింది. ప్రస్తుత ప్రభుత్వం ఈ పనులపై దృష్టి పెట్టాలి.

– బమ్మిడి శ్రీరామూర్తి, ఉపాధ్యాయుడు, మారుతీనగర్, నరసన్నపేట

విస్తరణ చాలా అవసరం



నరసన్నపేటలో రోడ్డు విస్తరణ చాలా అవసరం. అటు మార్కెట్ కమిటీ కూడలి నుంచి ఇటు సత్యవరం కూడలి వరకు రోడ్డును 80 అడుగుల మేర అభివృద్ధి చేయాలి. అప్పుడే పట్టణం మరింతగా అభివృద్ధి చెందుతోంది. ఇప్పటికే కొంత భాగం విస్తరణ అయింది. మిగిలిన భాగం కూడా విస్తరణ చేస్తే బాగుంటుంది. ఈ దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– ధర్మాన వెంకటరమణ, న్యాయవాది,పెద్దపేట, నరసన్నపేట

రూ.12 కోట్లతో ప్రతిపాదనలు



మెయిన్ రోడ్డు మిగిలిన భాగం విస్తరణకు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సూచనల మేరకు రూ.12 కోట్లతో ప్రతిపాదనలు పంపాం. వీటికి అనుమతులు రావాల్సి ఉంది. అనుమతులు వస్తే వెంటనే పనులు ప్రారంభిస్తాం. మొత్తం రోడ్డు 2.8 కిలో మీటర్లు కాగా.. 1.7 కిలో మీటర్లు పొడవున రోడ్డును విస్తరించాల్సి ఉంది.

– ఎ.శ్రీనివాసరావు, ఏఈ ఆర్‌అండ్‌బీ, నరసన్నపేట

దుర్గమ్మకు ప్రత్యేక పూజలు



దుర్గాదేవిని దర్శించుకుంటున్న తమ్మినేని సీతారాం, నాయకులు

ఆమదాలవలస: పట్టణంలోని పాలపోలమ్మ తల్లి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన దేవి పంచరాత్రి మహోత్సవాల్లో భాగంగా దుర్గాదేవి అమ్మవారిని మాజీ స్పీకర్, వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం పార్లమెంటరీ పరిశీలకులు తమ్మినేని సీతారాం శుక్రవారం దర్శించుకున్నారు. వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. తమ్మినేనికి సత్కరించారు. పార్టీ రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్, పార్టీ నాయకులు బొడ్డేపల్లి రమేష్‌కుమార్, అల్లం శెట్టి ఉమామహేశ్వరరావు, దుంపల శ్యామలరావు, దుంపల చిరంజీవిరావు, మామిడి రమేష్, కుసుమంచి శ్యామ్‌ప్రసాద్, పొన్నాడ చిన్నారావు, పొడుగు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దసరాకు ఏర్పాట్లు పూర్తి



విద్యుత్ కాంతులతో సిద్ధమైన నీలమణిదుర్గ ఆలయం



క్యూ కోసం ఏర్పాటు చేసిన బారీకేడ్లు



ఆలయం వద్ద బందోబస్తు కోసం వచ్చిన పోలీసులు

- వాహన పూజలకు ప్రత్యేక క్యూ..
- ఆలయం వద్ద బందోబస్తు

పాతపట్నం: నీలమణిదుర్గ ఆలయానికి దసరా సందర్భంగా వచ్చే భక్తులకు అన్ని ఏర్పాటు పూర్తి చేశారు. పాతపట్నం సీఐ ఎస్.రామారావు ఆధ్వర్యంలో పాతపట్నం, మెళియాపుట్టి, కొత్తూరు, హిరమండలం స్టేషన్‌ల నుంచి వచ్చిన పోలీసులతోపాటు రిజర్వ్ పోలీసులు శని, ఆదివారాల్లో బందోబస్తు నిర్వహించనున్నారు. అమ్మవారి ఆలయం ముందు బారీకేడ్లు ఏర్పాట్లు చేశారు. వాహన పూజలను ఆలయం ముందు చేసుకోవాలని సీఐ సూచించారు.

టెక్కలి నుంచి పాతపట్నం వచ్చే బస్సులు ఆలయం వెనుక నుంచి రహదారి మీదుగా వెళ్లాలన్నారు. భక్తులు ఎటువంటి ఇబ్బంది పడకూడదని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. శనివారం సాయంత్రం సీఐ రామారావుతో కలిసి ఆలయం వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. ఈఓ వాసుదేవరావు, ఎస్ఐ లావణ్య పాల్గొన్నారు.

చెరువు ఆక్రమణలపై నివేదిక అందజేస్తాం



రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీఓ సాయిప్రత్యూష

జలుమూరు: ప్రభుత్వ భూములు ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని శ్రీకాకుళం ఆర్డీఓ సాయి ప్రత్యూష అన్నారు. శుక్రవారం చిన్నదూగాం పంచాయతీ కాకర్ల చెరువు సర్వే నంబర్ 48, 59లోని సుమారు 35 ఎకరాల భూ ఆక్రమణలు, వాటి రికార్డులు పరిశీలించారు. ఈ భూములు ఆక్రమణలకు గురైనట్లు గరీబ్ గైడ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి, సుప్రీం కోర్టు న్యాయవాది డి.వి.రావు గతకొన్నేళ్లుగా పోరాటం చేస్తున్నారు. ఈ ఆక్రమణలపై ప్రభుత్వ ఉన్నతాధికారులతోపాటు జిల్లా కలెక్టర్‌కు సైతం నోటీసులు జారీ అయ్యాయి. ఈ క్రమంలో చెరువు విస్తీరణం ఎంత, ఆక్రమణలకు గురైనది ఎంత అన్నది ఆర్డీఓ రికార్డులను పరిశీలించారు. దీనిపై కలెక్టర్‌కు నివేదించనున్నట్లు ఆర్డీఓ తెలిపారు. తహసీల్దార్ జెన్ని రామారావు, సర్వేయర్ నాగేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలందరికీ దసరా శుభాకాంక్షలు



రెడ్డి శాంతి, మాజీ ఎమ్మెల్యే పాతపట్నం

ఎల్.ఎన్.పేట: జిల్లాలో అన్ని వర్గాల ప్రజానీకానికి దసరా పండగ శుభాకాంక్షలను పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయదశమి పండగ నుంచి అన్ని వర్గాల వారికి విజయాలు చేకూరేలా విజయవాడ కనకదుర్గ, పాతపట్నం నీలమణిదుర్గ అమ్మవారుల ఆశీర్వాదం లభించాలన్నారు. రైతుల పంటలు ఇంటికి చేరుకోవాలని, కనీస మద్దతు ధర లభించాలని ఆకాంక్షించారు.

అన్నదమ్ముల ఘర్షణ.. ఒకరికి గాయాలు

సారవకోట: మండలంలోని గొర్రిబంద గ్రామానికి చెందిన అన్నదమ్ముల మధ్య శుక్రవారం జరిగిన ఘర్షణలో ఒకరు గాయాలపాలయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఈ గ్రామానికి చెందిన జాడ ఆనందరావు, బాలరాజు కుటుంబ సమస్యల కారణంగా ఘర్షణ పడి ఒకరినొకరు కొట్టుకున్నారు. బాలరాజు గాయపడ్డారు. ఎంఎల్‌సీకి పాతపట్నం పంపించినట్లు ఎస్ఐ అనీల్ కుమార్ తెలిపారు. ఇరువురు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

7 మద్యం బాటిళ్ల స్వాధీనం

సారవకోట: మండలంలోని అలుదు గ్రామానికి చెందిన పొట్నూరు సత్యానారాయణ వద్ద అక్రమంగా నిల్వ ఉన్న 7 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు ఎస్ఐ అనీల్ కుమార్ శుక్రవారం తెలిపారు. సత్యానారాయణను రిమాండ్‌కు పంపించామన్నారు.

జై దుర్గాభవానీ..

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజు శుక్రవారం దుర్గాదేవి అమ్మవారు మహిషాసురమర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. మహానవమి సందర్భంగా భక్తులు భారీగా మండపాలు, ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. సామూహిక కుంకుమ పూజల్లో మహిళలు పాల్గొన్నారు. అమ్మవారికి పిండి వంటలతో నైవేద్యం సమర్పించారు.

– సాక్షి నెట్‌వర్క్



సరుబుజ్జిలి: పురుషోత్తపురంలో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



నరసన్నపేట: యారబాడులో కుంకుమ పూజలు నిర్వహిస్తున్న మహిళలు



బూర్జ: దుర్గాదేవికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



ఆమదాలవలస: కన్యకాపరమేశ్వరి ఆలయంలో లలితా పారాయణం చేస్తున్న మహిళలు



సారవకోట: అవలింగి నీలమణి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో చండీ హోమం నిర్వహిస్తున్న భక్తులు



సారవకోట: ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు



పాతపట్నం: నీలమణిదుర్గ అమ్మవారి ఆలయం వద్ద చిన్నారుల నృత్యం




హిరమండలం: సుభలయిలో మహిషాసురమర్దినిగా దుర్గాదేవి అమ్మవారు



పొందూరు: కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో మహిషాసురమర్దిని అలంకరణలో దుర్గామాతా



హిరమండలం: పెద్దకోరాడలో మహిషాసురమర్దినిగా పాతపట్నం నీలమణిదుర్గమ్మ



కొత్తూరు: మహర్తాపురంలో మహిషాసురమర్దిని అవతారంలో దుర్గాదేవి

మార్కెట్‌కు దసరా కళ..



నరసన్నపేట: రద్దీగా ఉన్న కాలేజీ రోడ్డు



పాతపట్నం: కొనుగోలుదారులు కిటకిటలాడుతున్న మార్కెట్



కొత్తూరు: వాహన పూజా సామగ్రీని కొనుగోలు చేస్తున్న భక్తులు

మార్కెట్‌కు దసరా కళ వచ్చింది. శనివారం విజయదశమి సందర్భంగా దుర్గామాతకు, వాహనాలకు పూజలు చేసేందుకు కావాల్సిన సామగ్రిని కొనుగోలు చేసేందుకు వచ్చిన వారితో మార్కెట్లన్నీ శుక్రవారం రద్దీగా మారాయి. అలంకరణ వస్తువులు, పువ్వులు, పండ్ల ధరలు అమాంతం పెరిగాయి. నాటుకోళ్లకు డిమాండ్ పెరిగింది.

– సాక్షి నెట్‌వర్క్

ధరలు తగ్గించడంలో ప్రభుత్వం విఫలం



జి.సింహాచలం, సీపీఎం నాయకుడు

హిరమండలం: పెరిగిన నిత్యావసరాల ధరలను నియంత్రణ చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి కార్యవర్గ సభ్యుడు జి.సింహాచలం శుక్రవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ఏమీ కొనలేం, ఏమీ తినలేం అన్నట్లుగా ప్రజలు ఉన్నారన్నారు. కూటమి ప్రభుత్వంలో సామాన్య ప్రజలు ఎవరూ బతకలేకపోతున్నారన్నారు. పండగ రోజుల్లో కూడా సామాన్య, మధ్య తరగతి ప్రజలకు కనీసం చౌకధరల దుకాణాల ద్వారానైనా సరుకులు సరఫరా చేసి ఉంటే బాగుండేదన్నారు. కూరగాయలు, నూనెలు, బియ్యం, పప్పులు వంటి సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయన్నారు. ధరలు ఇలా ఉంటే పేద ప్రజలు ఎలా పండగ చేసుకుంటారని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు.

బాధ్యతల స్వీకరణ



తహసీల్దార్ రామారావు

జలుమూరు: స్థానిక తహసీల్దార్‌గా జెన్ని రామారావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన శ్రీకాకుళం ఆర్డీఓ కార్యాలయ పరిపాలన అధికారిగా పనిచేసి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పని చేసిన లక్ష్మీనారాయణ శ్రీకాకుళం ఆర్డీఓ కార్యాలయానికి ఏఓగా వెళ్లారు. ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో ప్రజలకు పారదర్శకంగా సేవలు అందిస్తానన్నారు.

సబ్సిడీపై నూనె విక్రయం



నూనె ప్యాకెట్ల పంపిణీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కూన రవికుమార్

ఆమదాలవలస: పట్టణంలోని రైతు బజార్‌లో పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వంట నూనెల విక్రయ కేంద్రాన్ని ఎమ్మెల్యే కూన రవికుమార్ శుక్రవారం ప్రారంభించారు. ప్రతీ రేషన్ కార్డుదారుడికి మూడు పామాయిల్ లీటర్ ప్యాకెట్లు (ఒక పామాయిల్ ధర రూ.110), ఒక సన్‌ప్లవర్ ఆయిల్ ప్యాకెట్ రూ.124లకు అందించడం జరుగుతుందన్నారు. అనంతరం పక్కనే ఉన్న అన్న క్యాంటీన్‌లో భోజనాలను పరిశీలించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.